సాక్షి

గుంటూరు

సోమవారం । 6 । జనవరి । 2025



వైభవంగా రామచంద్రస్వామి కల్యాణం

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం (పెద్ద గుడి)లో ఆదివారం శ్రీరామచంద్రస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 568.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు వదిలారు.

మోహిని అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారిని మోహిని అవతారంలో జగన్మోహనకారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

త్రిదండి చిన్న జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: హిందూ దేవాలయాల పరిరక్షణకు యువత నడుం బిగించాలని, మన సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం మంగళగిరి బాపూజీ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు 21వ రోజుకు చేరుకున్నాయి. 21వ పాశురాన్ని త్రిదండి చిన్న జీయర్‌స్వామి భక్తులకు వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. గన్నవరం, నగరిక, వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 160 మంది భక్తులు గోదాదేవికి సారె సమర్పించి, స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారని తెలిపారు.

బగళాముఖిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి




చందోలు(కర్లపాలెం): స్వయంభువై వెలసిన బగళాముఖి అమ్మవారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ దంపతులు దర్శించుకున్నారు. తొలుత జస్టిస్ గుణరంజన్ కుటుంబ సభ్యులకు బాపట్ల మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్, ఆర్డీవో, రెవెన్యూ సిబ్బంది, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఆలయ విశేషాలను తెలిపారు. అమ్మవారి చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పొన్నూరు: పొన్నూరులోని సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి వార్లను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ ఈవో గద్దె అమర్నాథ్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

పీకేజీ మేజర్ కాలువకు నీటి సరఫరా పునరుద్ధరణ

కారెంపూడి: పెదకొదమగుండ్ల మేజర్ కాలువకు ఎన్‌ఎస్‌పీ అధికారులు ఆదివారం సాయంత్రం సాగు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రధాన కుడి కాల్వ నుంచి మేజర్ కాలువకు నీరు విడుదలయ్యే దగ్గరున్న గేటు విరిగిపోయి ప్రవాహానికి అడ్డుపడడంతో సమస్య వచ్చింది. దీంతో 20 రోజులుగా కాల్వకు నీటి సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. రబీ వరి పైర్ల సాగు పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో రైతులు నీటి కోసం ఆందోళన చెందారు. మూడు రోజులు ఎన్‌ఎస్‌పీ ఏఈ యరపతినేని రామయ్య, ఎన్‌ఎస్‌పీ సిబ్బంది రైతుల సహకారంతో గేటు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కాలువకు నీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటి సంఘం అధ్యక్షుడు పోలయ్య, బొమ్మిన శేషగిరి తదితరులు నీటి పునరుద్ధరణ చర్యల్లో పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 200, పశ్చిమ కెనాల్‌కు 100, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.

పులిచింతల ప్రాజెక్టుపై రాకపోకలు బంద్

అచ్చంపేట: మాదిపాడు నుంచి పులిచింతల ప్రాజెక్టు అప్రోచ్ రోడ్డు వరకు బీటీ రోడ్డు, గిరిజన తండాలైన కంచుబోడు, జడపల్లి తండాలలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్న కారణంగా పులిచింతల ప్రాజెక్టు పైనుంచి తెలంగాణకు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు కృష్ణానదిని దాటాల్సిన ప్రయాణికులు బల్లకట్టు, పడవల ద్వారా వెళ్లాల్సి ఉంది. మామూలుగా అయితే కార్లు, మోటారు వాహనాలకు ప్రాజెక్టుపై నుంచి వెళ్లేందుకు అనుమతులున్నాయి.

కిలకిల.. కళకళ..!

పక్షి ప్రేమికులను ఉప్పలపాడు అలరిస్తోంది. దేశ విదేశాల నుంచి తరలివస్తున్న పక్షులతో ఈ విడిది ఇల్లు సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన పక్షుల కిలకిలారావాలతో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. మూడు రుతువుల్లో 27 రకాల పక్షి జాతులు ఉప్పలపాడుకు వస్తుండటం విశేషం. అటవీశాఖ పర్యవేక్షణలో చిన్నారులకు ఆట వస్తువులు, సందర్శకులకు చెరువు ఒడ్డున చెట్ల నీడన కూర్చుని పక్షులను తిలకించేలా ఏర్పాట్లు చేశారు.

- విదేశీ జాతుల విడిది ఇల్లుగా ఉప్పలపాడు పక్షుల కేంద్రం
- ఏటా దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో రాక
- ప్రకృతి అందాల నడుమ వీక్షించేందుకు ఏర్పాట్లు



సేద తీరుతున్న పక్షులు

పెదకాకాని: ఆహ్లాదకర వాతావరణంలో వేల సంఖ్యలో సేద తీరుతున్న పక్షులతో ఉప్పలపాడు పక్షుల కేంద్రం కొత్త కళ సంతరించుకుంది. జిల్లా కేంద్రమైన గుంటూరుకు 8 కిలోమీటర్ల దూరంలో ఈ పక్షుల కేంద్రం ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో వాటి పేర్లను తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ఆట వస్తువులు, ఊయలలు అందుబాటులో ఉంచారు. పక్షుల కేంద్రానికి రెండు వైపులా చెరువు కట్టపై పర్యాటకులు కూర్చుని పక్షులను తిలకించేలా బెంచీలు ఏర్పాటు చేశారు. ఏడాది పొడవునా ఎప్పుడు చూసినా ఐదు వేల పక్షులు ఇక్కడ కనువిందు చేస్తుంటాయి. ఏటా సెప్టెంబరు – మార్చి వరకు సుమారు 30 వేల పక్షులు సేద దీరుతుంటాయి. ఆస్ట్రేలియా, సైబీరియా, చైనా, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, మయన్మార్, అమెరికా నుంచి వలస వస్తున్నట్లు గుర్తించారు. ఇలా వచ్చే 27 రకాల జాతుల్లో దాదాపు 22 రకాలు విదేశాలవే. ఆయా రుతువుల్లో ఇక్కడికి వచ్చి పచ్చని చెట్లపైన ఆవాసాలు ఏర్పాటు చేసుకుని గుడ్లు పెట్టడం, పిల్లల్ని చేయడం, ఎగిరే దశకు వచ్చిన తరువాత వాటిని వెంట బెట్టుకుని తిరిగి వెళ్లిపోవడం పక్షులకు అలవాటుగా మారింది. ఈ కేంద్రంలో పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10 చొప్పున టిక్కెట్ రుసుము వసూలు చేస్తారు.





పక్షుల కేంద్రం ముఖద్వారం

విస్తరిస్తే మరింత మేలు

చెరువు విస్తీర్ణం చాలక కొన్ని పక్షులు ఉదయాన్నే చుట్టు పక్కల చెరువులకు చేరుతున్నాయి. తిరిగి సాయంత్రానికి ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి వస్తున్నాయి. వాటికోసం అధికారులు ఇనుప స్టాండ్‌లు ఏర్పాటు చేశారు. పది ఏళ్ల కిందట పక్షులకు చెరువు చాలడం లేదని గుర్తించిన అధికారులు చెరువు విస్తీర్ణం పెంచేందుకు పక్కనే ఉన్న పొలాన్ని పరిశీలించారు. ఆ పొలాన్ని కొనుగోలు చేయాలనే ప్రతిపాదనలు కూడా పంపించారు. పొలం యజమానులు, అధికారులు ఏకాభిప్రాయానికి రాలేదు. అది కాస్తా ప్రతిపాదనలకే పరిమితమైంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని విస్తరించి పర్యాటక కేంద్రంగా మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

ఒకటికి పది సార్లు అడిగినా జవాబు శూన్యం

- 'తమాషా చేస్తున్నారా..?' అని కమిషనర్‌ను ప్రశ్నించలేదు
- విజయవాడ వరద బాధితులకు రూ.9.22 కోట్లు ఖర్చు
- పంపిణీ వెనుక కమిషనర్ వ్యక్తిగత అజెండా కనిపిస్తోంది
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు

నగరంపాలెం: జీఎంసీ నిధుల ఖర్చుపై కౌన్సిల్ సమావేశంలో అధికారులను ఒకటికి పదిసార్లు అడిగినా తగిన జవాబు రాలేదని డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. ఈ నెల 4వ తేదీన జీఎంసీ కౌన్సిల్ సమావేశంలో జరిగిన అంశాలపై కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యతపై తమపై ఉందని పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్లు వంగల హేమలత, ధూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకట కృష్ణమాచారి (ఆచారి), ఆడకా పద్మావతి, బూసి రాజలత, పడాల సుబ్బారెడ్డి, యాట్ల రవి, పఠాన్ రిహానా, అబీద్, పాపతోటి అంబేడ్కర్, వంగల హేమలత, కాండ్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, పూనూరి నాగేశ్వరరావులతో కలసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డైమండ్ బాబు మాట్లాడుతూ... జీఎంసీ పరిధిలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎన్ని? ఎంత విత్‌డ్రా చేశారు? విత్‌డ్రా చేస్తే ఎందుకు చేశారు? అనే అంశాలపై వివరాలు అడిగితే సమావేశంలో అధికారుల నుంచి సమాధానం రాలేదన్నారు. ఇది పరిపాలన అంశమని ఎవరు రాశారని అడగ్గా సమాధానం చెప్పలేదన్నారు. '57 మంది ప్రజా ప్రతినిధులకు మీరిచ్చే జవాబు ఇదేనా.. తమాషా చేస్తున్నారా?' అని తాను అడిగానని గుర్తుచేశారు. ఒకటికి పదిసార్లు అడిగిన తర్వాత కమిషనర్ లేచి, ఇందులో రాసిన ప్రతి దానికి తనదే బాధ్యత అని మౌనంగా కూర్చున్నారని తెలిపారు. సరైన సమాధానం మాత్రం చెప్పలేదన్నారు. కమిషనర్ మైకు విసిరేసి, కాగితాలు చించి వేయడం చూసి ఆశ్చర్యమేసిందని చెప్పారు. ఏదైనా ఉంటే మేయర్‌తో మాట్లాడాలని, బాయ్‌కాట్ మంచిది కాదన్నారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 'తమాషా చేస్తున్నారా?' అని కమిషనర్‌ని ప్రశ్నించలేదని, పరిపాలన అంశమని రాసింది ఎవరని అడిగానని గుర్తు చేశారు. పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల్లో పక్షపాతం చూపిస్తున్నారని గుత్తేదార్లు చెప్పారన్నారు.

పది రోజుల్లోనే చెల్లింపులా?

గతేడాది ఆగస్టులో విజయవాడలో వరద బాధితుల సహాయర్థం రూ.9.22 కోట్ల విలువ చేసే ఆహారపు పొట్లాలు, బిస్కెట్లు, పాలు, నీటి సీసాలు ఇతరత్రా పంపించారన్నారు. సాయంలో అభ్యంతరం లేదని, పంపిన విధానంలో కమిషనర్ వ్యక్తిగత అజెండాగా కనిపిస్తోందని డైమండ్ బాబు ఆరోపించారు. ఈ పంపిణీ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యేలు, కౌన్సిల్ సభ్యులకు తెలియలేదన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది రోజుల్లో డబ్బులు చెల్లించారని ఆరోపించారు. పంపిణీ దారులు ఎవరు? వారి అర్హతలు ఏంటి? వంటివి విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఇదంతా బుడమేరు బాధితులకు చేరిందా? అనేది నిరూపించాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉందని పేర్కొన్నారు. నిధులు ఇష్టారాజ్యంగా వాడుకుంటే ప్రజలు క్షమించరని అన్నారు. ఐఏఎస్ అధికారిగా కమిషనర్ ప్రవర్తించడం లేదని, వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ధర్నా చేయించడాన్ని ఒకసారి పరిశీలిస్తే వారిని తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ పన్నిన కుట్రలో భాగమని ఆరోపించారు. కమిషనర్ కూడా అధికార పార్టీ మెప్పుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు.

పెన్షన్ అందక విశ్రాంత ఆచార్యులకు ఇక్కట్లు

- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు ఆలస్యం
- ప్రభుత్వం, ఏఎన్‌యూల మధ్య సమన్వయలోపం



వర్సిటీ ప్రధాన ద్వారం

గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సుదీర్ఘకాలం సేవలు అందించి నేడు విశ్రాంత జీవనం గడుపుతున్న ఆచార్యులు సమయానికి పెన్షన్ అందక ఇక్కట్లు పడుతున్నారు. ఉద్యోగ విరమణ చేసిన అనంతరం పెన్షన్‌పైనే ఆధారపడటంతో ఎక్కువమందికి అవస్థలు తప్పడం లేదు. సుమారు 148 మంది బోధన, 522 మంది బోధనేతర సిబ్బంది వర్సిటీలో పెన్షన్‌దారులుగా ఉన్నారు. వీరి వివరాలను ప్రతి నెలా వర్సిటీ నుంచి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కమ్యూనికేషన్ పోర్షన్ పెన్షన్‌ను మినహాయించకుండా చెల్లింపులు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్సిటీలకు సమాచారమిచ్చింది. దానికి అనుగుణంగా సవరణలు చేసి ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాల్సి ఉంది. నాగార్జున వర్సిటీ మాత్రం ఈ నిబంధన ప్రకారం సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరచలేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు పెన్షన్ ఇవ్వలేదు. కొందరు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఆరా తీయగా విషయం వెల్లడైంది. అధికారిక సమాచారం లేకనే పాత విధానంలోనే వివరాలు నమోదు చేశామని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. తర్వాత కొత్త విధానంలో నమోదు చేశారు. తీరా ఆ పెన్షన్ చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని, కొన్ని రోజులు ఆగాలని చెప్పినట్లు తెలిసింది. ఇతర వర్సిటీలు సొంత నిధుల నుంచి పెన్షనర్లకు చెల్లింపులు చేశాయని, తమకూ సుమారు రూ.1.59 కోట్లను ఇలా చెల్లించాలని పింఛనుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి రాగానే తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఏఎన్‌యూ అధికారులు మాత్రం సొంత నిధులు కూడా లేవని చేతులెత్తేసినట్లు సమాచారం. దీంతో పెన్షన్ ఎప్పటికి వస్తుందో తెలియని స్థితిలో విశ్రాంత ఆచార్యులు ఉన్నారు.



పాటిబండ్లలో పుట్టిన మత గురువులు

'దివ్య' తేజస్సు

పాటిబండ్లలో ఆధ్యాత్మిక సందడి

- వైభవంగా ముగ్గురు రాజులు శత వార్షికోత్సవాలు
- వందలాది మంది మత గురువులతో ప్రత్యేక దివ్యపూజ బలి
- వేలాదిగా తరలివస్తున్న కతోలిక్‌లు
- నిత్యం 20 వేల మందికి అన్నదానం
- తరలిరానున్న తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు

పెదకూరపాడు: కతోలిక్‌ల పుణ్యభూమి పాటిబండ్ల గ్రామంలో ముగ్గురు రాజులు దేవాలయ శత వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేలాదిగా తరలివస్తున్న రోమన్ కతోలికులు, వందలాదిగా తరలివచ్చిన మత గురువులు, మతకన్యలు, విదేశీ భక్తులతో కోలాహలంగా మారింది. వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు నల్లపాడు సీనియర్ గురువులు రెవరెండ్ ఫాదర్ అల్లం శౌర్రెడ్డి పాటిబండ్ల గ్రామంలో పుట్టి వివిధ ప్రదేశాల్లో గురువులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న 60 మంది మత గురువులతో కలిసి ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. దాచేపల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ యేరువ బాలశౌర్రెడ్డి ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఈ లోక ఆశలను వీడి, దేవుని ప్రేమలో నిలవాలని కోరారు. 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన ముగ్గురు రాజులు దేవాలయం అనేక మందిని దేవుని సేవలో, ప్రేమలో నిలిపిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పుట్టి వివిధ ప్రాంతాల్లో దైవసేవలో ఉన్న 60 మంది గురువులు, 200 మంది మతకన్యలు ఒకే చోటకు చేరి సందడి చేశారు. వేడుకలు విజయవంతం చేసేందుకు ఆర్థిక, సామాజిక సహాయం అందించిన వారికి స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిన హృదయ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శత వార్షికోత్సవం సందర్భంగా గత మూడు రోజులు నిత్యం 25 వేల మందికి అన్నదానం నిర్వహించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్నపానీయాలు అందుబాటులో ఉంచారు.

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా

- గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు
- గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు

ఆ ఐదుగురు మంచి మిత్రులు. అందరూ ఒకే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం కావడంతో సరదాగా ఈతకు వెళదామని నిర్ణయించుకున్నారు. ఇంట్లో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత సుమారు 4.30 గంటల సమయంలో ఐదుగురు ఈతకు వెళ్లారు. పట్టణ శివారులో ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ముగ్గురు ఒకచోట, ఇద్దరు మరొకచోట ఈతకు దిగారు. ఇద్దరు గల్లంతు కాగా.. ముగ్గురు ప్రాణాలతో బయట పడ్డారు. గల్లంతైన ఇద్దరూ మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది.



కాలువ నుంచి చరణ్ మృతదేహాన్ని బయటకుతీస్తున్న బంధువులు

సత్తెనపల్లి: ఈత సరదా కోసం వెళ్లి ఇద్దరు మృతి చెందగా ముగ్గురు ప్రాణాలతో బయటపడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రఘురామ్‌నగర్‌కు చెందిన బైకం.మహేష్, రౌతు ధరణికుమార్, మున్సిపల్ ఏరియాకు చెందిన గౌడుగుల హర్ష వరుణ్, వడ్డవల్లి శాస్త్రీనగర్‌కు చెందిన నల్లూరి గోపీచంద్, రాజులకాలనీకి చెందిన పాదిలి చరణ్‌లు పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఐదుగురు మంచి స్నేహితులు కావడం, ఆదివారం సెలవు రావడంతో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత అందరూ ఒకరికొకరు మాట్లాడుకొని ఐదుగురు కలిసి సుమారు మూడు గంటల సమయంలో ఈతకు పయనమయ్యారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో బి.మహేష్, జి.హర్షవరణ్, రౌతు ధరణికుమార్ ఒకచోట దిగగా.. నల్లూరి గోపీచంద్, పాదిలి చరణ్ మరోచోట ఈతకు దిగారు. గోపీచంద్, చరణ్ దిగిన చోట కాలువలో లోతు ఎక్కువగా ఉండడంతో వారిద్దరూ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన ముగ్గురూ భయాందోళన చెంది కాలువ నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. పెద్దగా కేకలు వేస్తూ స్థానికంగా ఉన్నవారికి చెప్పి విలపించారు.

ముమ్మర గాలింపు చర్యల తర్వాత..

స్థానికులు, పిల్లల కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం చేరవేయడంతో ఒక్కసారిగా అందరూ కాలువ వద్దకు చేరుకున్నారు. గోపీచంద్, చరణ్ కనిపించకపోవడంతో గజ ఈతగాళ్లతో పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అరగంట పాటు వెతికిన తర్వాత పాదిలి చరణ్(15) మృతదేహం కనిపించింది. చరణ్ మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీసి సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాల కు తరలించారు. చరణ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. గోపీచంద్ గల్లంతై కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు గుండెల బాదుకుంటూ రోదించారు. గల్లంతైన గోపీచంద్ కోసం సీఐ బ్రహ్మయ్య, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్లని దింపి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో లైట్లు తీసుకువచ్చి ప్రొక్లెయిన్‌తో సమీపంలోని చెట్లను తొలగింపు చేపట్టారు. ఎక్కడైతే గోపిచంద్ గల్లంతు అయ్యాడో అక్కడ 50 మందిని కాలువలోకి దించి ఒకరికొకరు చేతులు పట్టుకొని అరకిలోమీటర్ ముందుకు సాగితే కనిపించే అవకాశం ఉంటుందని భావించి ఆ మేరకు చర్యలు చేపట్టగా 8.40 గంటలకు నల్లూరి గోపిచంద్(15) మృతదేహం కనిపించింది. విద్యార్థులు గల్లంతైన విషయం తెలియడంతో పెద్ద ఎత్తున సమీప ప్రాంత ప్రజలు కాలువ వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు.



ప్రాణాలతో బయట పడిన ముగ్గురు స్నేహితులు

ప్రభువా మాకెందుకు అన్యాయం చేశావయ్యా...

ప్రభువా మేము నీకు ఏ లోటు చేశాం తండ్రీ. మాకెందుకు ఇంత అన్యాయం చేశావయ్యా అంటూ గల్లంతై మృతి చెందిన నల్లూరి గోపీచంద్ తల్లిదండ్రులు కిరణ్‌కుమార్, సుహాసిని రోదిస్తున్నారు. కిరణ్ కుమార్ పట్టణంలోని ప్రైవేట్ బ్యాంకు వద్ద, సుహాసిని నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాల వద్ద సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తూ పట్టణంలోని వడ్డవల్లి శాస్త్రీనగర్‌లో ఉంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. తాము చదువుకోలేక పోయామని బిడ్డలు ఇద్దరైనా ప్రయోజకులు కావాలని పెద్ద కుమారుడు ప్రసన్నకుమార్‌ను గుంటూరులో డిగ్రీ ప్రథమ సంవత్సరం, చిన్న కుమారుడు గోపిచంద్‌ను సత్తెనపల్లిలో తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు. చిన్న కుమారుడు స్నేహితులతో కలిసి వెళ్లి కాలువలో గల్లంతై మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

చదువుకునేందుకు వచ్చి..

ఈతకు వెళ్లి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో మృతి చెందిన పాదిలి చరణ్‌ది యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామం. పాదిలి భాస్కర్, కృష్ణకుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పాదిలి.చరణ్‌ను సత్తెనపల్లి రాజుపాలకాలనీలో లస్కర్‌గా పని చేస్తున్న తాతయ్య రాచకొండ జగన్నాథం వద్ద ఉంచారు. రెండేళ్ల నుంచి చరణ్ ఇక్కడే ఉంటూ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లి కాలువలో గల్లంతై మరణించాడు. దీంతో అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చదువుకునేందుకు వచ్చి విగతజీవిగా మారావా అంటూ రోదించారు.



పాదిలి చరణ్ మృతదేహం

క్లుప్తంగా

ప్రణాళికతో శ్రమిస్తే విజయం సొంతం



పెదకాకాని: ప్రణాళికాబద్ధంగా కష్ట పడితే విజయం సొంతం అవుతుందని వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి వై. సత్యనారాయణ అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులను స్మరిస్తూ 'విద్యావకాశాలు- ఉద్యోగాల సాధన' అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ... పూలే దంపతులు స్ఫూర్తి ప్రదాతలు అన్నారు. నేటి యువతకు ఎన్నో సదుపాయాలు, అద్భుత అవకాశాలు ఉన్నాయని గుర్తుచేశారు. అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడమే తమ లక్ష్యం అన్నారు. ఐటీ విశ్రాంత ప్రధాన అధికారి టి. తిరుమల కుమార్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా కఠిన శ్రమ చేస్తే ఎలాంటి ఉద్యోగమైనా వచ్చి తీరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారి మస్తానయ్య మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే తమ వృత్తి, ప్రవృత్తితోపాటు సామాజిక బాధ్యతను కూడా ప్రతిఒక్కరు స్వీకరించాలన్నారు. అప్పుడే సమాజం బాగుంటుందని చెప్పారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి సంబంధించిన అంశాలను వివరించారు. ఏపీఎస్‌డీఏడబ్ల్యూసీ ఎండీ ఎంఏ కుమార్ రాజా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరాన్ని తెలిపారు. తొలుత పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ, ప్రసాద మూర్తి, గౌడ జన సేవా సమితి సభ్యులు పామర్తి సాంబశివరావు, జల్లెడ శ్రీనివాసరావు, వాకా రాంగోపాల్ గౌడ్, బెల్లంకొండ సదాశివ గౌడ్, డాక్టర్ టి. సేవ కుమార్, డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ- బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలి

లక్ష్మీపురం: విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థల ద్వారా కాకుండా నేరుగా ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శి టి.వి.జి. రవిశంకర్ ఆదివారం పేర్కొన్నారు. అలా చేయకుంటే ఆర్టీసీ గ్యారేజ్‌లన్నీ మూతపడతాయని, క్రమంగా ఆర్టీసీ నామమాత్రంగా మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పాలసీలో ఆర్టీసీకి సబ్సిడీ వచ్చేలా మార్పు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీకి కేటాయించాలని కోరుతూ మంగళవారం విజయవాడలో రాష్ట్ర కమిటీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాస్త జాగ్రత్త... ఆరోగ్యానికి రక్ష!

- ఏడాదిలో సుమారు 10 లక్షల మందికి జీజీహెచ్ చికిత్సలతో లబ్ధి
- వైద్యుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యాధుల నుంచి త్వరగా ఉపశమనం

గుంటూరు మెడికల్: వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఇటు శారీరకంగా, అటు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో 2024లో అవుట్‌పేషెంట్ విభాగంలో 10,32,284 మంది రోగులు, ఇన్ పేషెంట్ విభాగంలో 94,4599 మంది వివిధ రోగాలకు చికిత్సలు పొందారు. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య చెప్పే పనే లేదు. అసలు వ్యాధులు రాకుండా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం మేలని పలువురు వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. నూతన ఏడాదిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పేర్కొంటున్నారు.



జీజీహెచ్‌లో ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులు (ఫైల్)

గుండె కోసం ఇవి పాటించాలి



అన్ని అవయవాల్లో గుండె ప్రధానమైంది. దీని ఆరోగ్యం కోసం తప్పనిసరిగా ప్రతిరోజు వ్యాయామం చేయాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. నూనె అధికంగా ఉండే పదార్థాలు , మాంసం వంటి కొవ్వు పదార్థాలను అతిగా తినకూడదు. ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. ఉప్పును సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలి. బీపీ, షుగర్‌లను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాల జోలికి వెళ్లకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలి.

– డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలంటే...



గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యే వరకు వివిధ రుగ్మతలు తలెత్తే అవకాశం ఉంది. మూడవ నెల నుంచి కాన్పు వరకు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలి. ఏడవ నెల వచ్చాక తరచుగా వైద్యులను కలిసి పరీక్షలు చేయించాలి. రక్తపోటు, రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆకుకూరలు, పాలు, గుడ్డు, పప్పుధాన్యాలు, ఇతర పౌష్టిక ఆహారాన్ని తినాలి. కాన్పులు తప్పనిసరిగా ఆస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటే తల్లీబిడ్డలకు సురక్షితంగా ఉంటుంది.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి ; స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు

బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవాలి



శరీరంలో వచ్చే అనేక రుగ్మతలకు రక్తపోటు, మధుమేహం ప్రధాన కారణాలు. ఇవి అదుపులో ఉంచుకుంటే మూత్రపిండాల సమస్యలు, గుండె ఫెయిల్, దృష్టి లోపాలు, పక్షవాతం తదితర సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. కోపం , చిరాకు, తలనొప్పి ఉంటే బీపీ ఉన్నట్లు భావించటం అపోహ. ఎక్కువగా ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి అదుపులో పెట్టుకోవాలి. రోజువారీ ఉప్పు వాడకం 5 గ్రాముల కన్నా తగ్గించాలి. యోగా రోజు చెయ్యాలి. పొటాషియం, క్యాల్షియం ఉండే పాలు, పండ్లు వంటి ఆహారాన్ని తీసుకోవాలి.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, ఇన్‌ఫెక్షస్ స్పెషలిస్ట్, గుంటూరు

కిడ్నీలు పాడవకుండా చూసుకోవడం ముఖ్యం



కిడ్నీల ఆరోగ్యం ఎంతో కీలకం. కాళ్లవాపులు, మూత్రం ఎక్కువసార్లు రావటం, మూత్రంలో మంట, రక్తం కారటం, ఆకలి లేకపోవటం, వాంతులు తదితర లక్షణాలు కన్పిస్తే మూత్ర పిండాలకు వ్యాధి సోకినట్లు అర్థం చేసుకోవాలి. కుటుంబంలో ఒకరికి ఉంటే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. నొప్పుల మాత్రలు ఎక్కువగా వాడటం, నాటు మందులు వాడటం, బీపీ, షుగర్‌లు అదుపులో లేకపోవటం వల్ల మూత్రపిండాలకు ఇబ్బంది కలుగుతుంది.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

వైభవంగా ముగ్గురు రాజుల పండుగ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీసభలో ముగ్గురు రాజులు (జ్ఞానులు) పండుగను వైభవంగా నిర్వహించారు. విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేశారు. మానవులను రక్షించేందుకు భగవంతుడు కన్నె మరియ గర్భాన శిశువు జన్మించేలా చేశాడన్నారు. ఆకాశంలో నక్షత్ర కాంతి ద్వారా ముగ్గురు జ్ఞానులు, గొర్రెల కాపరి, మరికొందరు మాత్రమే శిశువు జన్మించిన ప్రాంతానికి వచ్చి ఆ బాలుడిని చూసి లోకరక్షకుడు జన్మించాడని గుర్తించారన్నారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ పి.విలియమ్స్, సహాయ విచారణ గురువు రవీంద్ర, మఠకన్యలు, కథోలిక క్రైస్తవులు, సోడాలిటీ సభ్యులు, గుడి పెద్దలు పాల్గొన్నారు.



వాక్యోపదేశం చేస్తున్న ఫాతిమా మర్రెడ్డి

గెజిటెడ్ అధ్యాపకుల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న గెజిటెడ్ అధ్యాపకులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) జిల్లా అధ్యక్ష , కార్యదర్శులుగా ఆర్. ఏసుపాదం, డాక్టర్ జి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ ఎన్నిక నిర్వహించారు. సంఘ జిల్లా కోశాధికారిగా డాక్ట్ కె.అపర్ణ సీతారామ్, ఉపాధ్యక్షుడిగా ఎం. ఏడుకొండలరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.కుటుంబరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వి. ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

12 నుంచి ముప్పాళ్లలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు(శావల్యాపురం): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న రైతుమిత్ర కమిటీ ప్రతినిధి తల్లపునేని రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ పోటీలకు ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 50 నుంచి 60 జట్లు వస్తాయని, ఇప్పటికే సెల్‌ఫోన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.9 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ నంబరు 9981922533, 9966671306, 8247479812 సంప్రదించాలన్నారు.

ఆర్థికాభివృద్ధిలో బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కీలకం

కొరిటెపాడు (గుంటూరు): దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంకు అధికారులు, ఉద్యోగుల పాత్ర మరువలేనిదని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ హోం సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా బ్యాంక్ రిటైరీస్ కో ఆర్డినేషన్ కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో జవహర్ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం ఎదుర్కొంటున్న సమస్యలు ఐకమత్యంతో పరిష్కరించుకోవాలని కోరారు. ఆల్ ఇండియా బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వారణాసి కృష్ణమూర్తి, ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.యల్లారావులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగ సంఘాల పోరాటాల ద్వారా ఫ్యామిలీ పెన్షన్ 1.97 లక్షల మందికి సాధించుకోగలిగామని పేర్కొన్నారు. బ్యాంక్ యాజమాన్యాలు జాతీయ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర జోనల్, రీజినల్ స్థాయి అధికారులు అమలు చేయడంలో కాలయాపన చేయడం బాధాకరమని తెలిపారు. దీనిపై తగిన రీతిలో కార్యాచరణ ప్రణాళిక ద్వారా త్వరలో ముందుకు సాగుతామని తెలిపారు. జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు కె.హరిబాబు కూడా మాట్లాడారు. పారిశ్రామికవేత్త ఎస్.కోటేశ్వరరావును సత్కరించారు. జిల్లా బ్యాంక్ రిటైరీస్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణారావు, తెలంగాణ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణ, వై.కోటేశ్వరరావు, హనుమంతరావు, వెంకయ్య, నిరంజన్ కుమార్, సుందరరెడ్డి, నాగార్జున, కళ్యాణ్, రాజశేఖర్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూబీఐ రీజినల్ హెడ్ జవహర్

తెనాలితో రాజగోపాల చిదంబరానికి ప్రత్యేక బంధం

తెనాలి: ముంబయిలో శనివారం కన్నుమూసిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, అణ్వస్త్ర పరీక్షల్లో కీలకభూమిక పోషించిన డాక్టర్ రాజగోపాల చిదంబరానికి తెనాలితో మరపురాని అనుబంధం ఉంది. భారత అణుశక్తి సంఘం చైర్మన్, కేంద్ర ప్రభుత్వ అణుఇంధన శాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు డాక్టర్ చిదంబరం 1999లో తెనాలి వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన తెనాలికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పేరిట పురస్కారాన్ని తెనాలిలో ఆయన స్వీకరించారు. నాజరుపేటలోని ఎస్‌వీఆర్ కళ్యాణమండపంలో ఆ ఏడాది నవంబరు 26వ తేదీన ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు ప్రముఖ పాత్రికేయుడు ఆర్.సంపత్ అధ్యక్షత వహించారు. ఆ సభలో ది హిందూ సంపాదకుడు ఎన్.రామ్ చేతుల మీదుగా అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా 'భారత శాస్త్రీయ పరిశోధన–అభివృద్ధిలో ప్రాధాన్యతలు–ప్రాముఖ్యతలు' అనే అంశంపై డాక్టర్ చిదంబరం తనదైన శైలిలో నాయుడమ్మ స్మారకోపన్యాసం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా మనం కూడా టెక్నాలజీ ప్రగతికి కలిసికట్టుగా కృషి చేయాలని తన ఉపన్యాసంలో సూచించారు. నాయుడమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి ఆనాటి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



డాక్టర్ చిదంబరానికి అవార్డు అందజేస్తున్న ఎన్.రామ్ (ఫైల్)

మైనారిటీలకు ఉచిత శిక్షణ

లక్ష్మీపురం: సీడాప్ ఆధ్వర్యంలో పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణకు మైనారిటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 6 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోషన్ జమీర్ బాషా ఆదివారం తెలిపారు. వయస్సు 18 – 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ చదివిన వారికి శిక్షణలో రవాణా ఖర్చులు, కెరీర్ కౌన్సెలింగ్, యూనిఫాం, వసతి, ఆహారం, స్టడీ మెటీరియల్, ఎన్ఎస్‌డీసీ సర్టిఫికేషన్ వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 'మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయం, నగరంపాలెం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2వ అంతస్తు, కన్నవారితోట' చిరునామాలోగానీ, 97043 10808 ,0863 – 2571 125 ఫోను నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు.

డ్రైవర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో డ్రైవర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 102 జిల్లా అధికారి సి.హెచ్. రాజేష్ చంద్ర తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. 96426 77337 ఫోను నంబరులో సంప్రదించాలన్నారు.

రేపటిలోగా అభ్యంతరాలు తెలియజేయాలి

సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ డి. మధుసూదనరావు

నెహ్రూనగర్: షెడ్యూల్డ్ కులాల జాబితాకు సంబంధించి వివరాలను సచివాలయంలో పొందుపర్చామని, అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోగా తెలియజేయాలని సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాలో తమ కులాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే సచివాలయంలోనే వీఆర్వోను కలిసి తెలియజేయవచ్చని తెలిపారు. 11వ తేదీన డేటాను పరిశీలన చేసి, 17న తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.

కొత్త మార్కెట్ విధానం రద్దుకు డిమాండ్



లక్ష్మీపురం: జాతీయ నూతన మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పంట రుణాల మాఫీకి జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్రం తెచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానంతో రైతాంగానికి నష్టమని ఆరోపించారు. కనీస మద్దతు ధర కూడా దక్కదన్నారు. వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రద్దు చేయించిన వ్యవసాయ నల్ల చట్టాల సారాంశాన్ని దొడ్డిదారిన మార్కెట్ విధానం ద్వారా అమలుకు కేంద్రం యతిన్నిస్తోందన్నారు. నూతన సహకార చట్టం వల్ల కార్పొరేట్లకు లాభమని, రైతాంగం పంట రుణాలు పొందే అవకాశం లేకుండా పోతుందని చెప్పారు. ఈ చట్టాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కూడా కార్పొరేట్లకే అనుకూలం అన్నారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించేలా చట్టం తీసుకురావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, కె.విట్టల్ రెడ్డి, పి.వి. జగన్నాథం, నాయకులు ముప్పాళ శివశంకర్, కుర్ర అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లులను మోసగించిన కూటమి ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

లక్ష్మీపురం: తల్లికి వందనం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల మాతృమూర్తులను మోసగించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మాత్రం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పడం తగదన్నారు. 85 లక్షల మంది తల్లులను మోసం చేసిందని ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. తల్లికి వందనం ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని, ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహం నుంచి ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల బకాయిలు విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో లక్షలమంది తల్లులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, అమర్నాథ్, నాయకులు అజయ్, ప్రసన్న, దిలీప్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

నగరంపాలెం: విద్యుత్ శాఖ ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం లాలుపురం సర్వీస్ రోడ్డులోని ఏఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ.మహేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికగా, ఎన్నికల అధికారిగా టి.సాయిసుధాకర్ వ్యవహరించారు. చీఫ్ అడ్వయిజర్‌గా ఎ.సుబ్బారావు, అధ్యక్షునిగా కె.వి.శేషారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.హుస్సేన్‌ఖాన్, సెక్రటరీ జనరల్‌గా పి.సన్యాసిరావు, ఉపాధ్యక్షులుగా ఆర్. సాంబశివరావు, పి.నరేంద్ర, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా బి.శ్రీనివాసరావు, బి.కె.మిశ్రా, ఫైనాన్స్ కార్యదర్శిగా కేవీ కోటేశ్వరరావు, ఆఫీస్ కార్యదర్శిగా కె.ప్రసాద్‌బాబు, పలువురు జాయింట్ కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కేవీ.శేషారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఏపీ విద్యుత్‌సంస్థల్లోని నెట్ వర్క్‌ను బలోపేతం చేయాలన్నారు.



నూతన కార్యవర్గం